క్లుప్తంగా

నేడు 'భూభారతి' చట్టంపై రైతులకు అవగాహన

గీసుకొండ : మండలంలోని కోనాయమాకుల రైతు వేదికలో రాష్ట్ర ప్రభుత్వం అములు చేస్తున్న భూభారతి చట్టంపై గురువారం రైతులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ఎండీ రియాజుద్దీన్ బుధవారం తెలిపారు. ఉదయం 8:30 గంటలకు రైతు వేదికలో ఈ సదస్సును నిర్వహిస్తున్నామని, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్, వ్యవసాయ అధికారి, ఆర్‌డీఓ పాల్గొంటారని వెల్లడించారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని చట్టం గురించి తెలుసుకోవాలని తహసీల్దార్ కోరారు.

పోషకాహారంతో ఆరోగ్యం


అన్నప్రాసన చేస్తున్న పార్వతి

నల్లబెల్లి : పోషకాహారం అందించడం వల్ల చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని బిల్‌నాయక్ తండా అంగన్ వాడీ టీచర్లు మాలోత్ పార్వతి, సీలు బాయి తెలిపారు. పోషణ్ అభియాన్‌లో భాగంగా మండలంలోని అర్వయ్యపల్లి శివారు బిల్‌నాయక్ తండా అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ డే


సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

నెక్కొండ : స్థానిక విద్యోదయ పాఠశాలలో బుధవారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం యూకేజీ విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ చల్లా నాగార్జున్‌రెడ్డితో కలిసి శ్రీపాల్‌రెడ్డి సర్టిఫికెట్లు అందించారు. పాఠశాల డైరెక్టర్ చల్లా పారిజాతం, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మహ్మద్ షరీఫ్, పీఆర్టీయూ(టీఎస్) మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాలోత్ ప్రతాప్‌సింగ్, కర్ర యాకూబ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి


మాట్లాడుతున్న ప్రణయ్‌దీప్

నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని వరంగల్ రోడ్డులో గల 813 సర్వే నంబర్‌లో గుడిసెలు వేసుకున్న పేదలకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ పాత తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం 23వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి ప్రణయ్‌దీప్ మాట్లాడుతూ..గుడిసె వాసులకు విద్యుత్, ఇంటి నంబర్లు, రోడ్డు, నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ

నర్సంపేట : ఎన్‌సీసీతో వ్యక్తిగత క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని ఎన్‌సీసీ అధికారి హవల్దార్ నిఖిల్, సంతోష్ పేర్కొన్నారు. 10(టి) బెటాలియన్ వరంగల్ ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విజ్‌డమ్ హైస్కూల్ విద్యార్థులకు బుధవారం ఎన్‌సీసీ-ఏ సర్టిఫికెట్లు అందజేశారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు టి.సాయితేజ, డి.ఉదయ్, ఎం.అన్వేష్‌లు తొలి మూడు స్థానాల్లో నిలిచారు. ఎన్‌సీసీ థర్డ్ ఆఫీసర్ ప్రశాంత్‌కుమార్, పాఠశాల డైరెక్టర్ జావేద్, చైర్మన్ జహంగీర్, వైస్ ప్రిన్సిపాల్ ప్రకాశ్, నాజియా ఇక్బాల్, ఫహీమ్ సుల్తానా, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు విద్యార్థులను అభినందించారు.

పరామర్శ



నర్సంపేట రూరల్ : నర్సంపేట సొసైటీ మాజీ చైర్మన్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కొయ్యడి లక్ష్మయ్య సతీమణి విజయలక్ష్మి ఇటీవల మృతిచెందారు. బుధవారం విజయలక్ష్మి చిత్రపటానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల అశోక్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్లాడి తిరుపతిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంభంపాటి పుల్లారావు, పంజాల రాము, జగన్‌మోహన్‌రెడ్డి, గుళ్లపెల్లి ఉమేందర్‌గౌడ్, కొయ్యడి రాజేష్‌గౌడ్, వెంకటేశ్వర్లు, రాజన్నలు తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలుగా మారేనా?

అప్‌గ్రేడ్‌కు నోచుకోని దుగ్గొండి, నెక్కొండ పీహెచ్‌సీలు

- జిల్లాలో ఏకైక సీహెచ్‌సీ వర్ధన్నపేట
- సిబ్బంది సర్దుబాటుకు తప్పని తిప్పలు
- మెరుగైన వైద్యసేవలకు మరో పీహెచ్‌సీ, సీహెచ్‌సీ అవసరం

నర్సంపేట రూరల్ : పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూడంచెల వైద్య వ్యవస్థను ఏర్పాటు చేసింది. గ్రామస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ), నియోజకవర్గ స్థాయిలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (సీహెచ్‌సీ), జిల్లా స్థాయిలో జనరల్ ఆస్పత్రులు, మెడికల్ కళాశాలలు నెలకొల్పి పేదలకు మెరుగైనా వైద్యసేవలు అందిస్తోంది. నర్సంపేటలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ టీవీవీపీ (తెలంగాణ వైద్య విధాన పరిషత్) ఆధ్వర్యంలో ఉండగా దానిని అప్‌గ్రేడ్ చేసి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)గా మార్చారు. అందులో వైద్యులను నియమించి, చికిత్స, వైద్యసేవలు సైతం ప్రారంభించారు. ఇక్కడ పనిచేసిన టీవీవీపీ సిబ్బందిని జిల్లాలో మిగిలిన ఏకైక ఆస్పత్రి వర్ధన్నపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు డిప్యూటేషన్‌పై పంపించారు. కానీ నర్సంపేట ఆస్పత్రికి మెడికల్ కళాశాల మంజూరు చేసే సమయంలోనే నర్సంపేట డివిజన్‌లోని నెక్కొండ, దుగ్గొండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అప్‌గ్రేడ్ చేయాలని అప్పటి నర్సంపేట ఆస్పత్రి సూపరింటెండెంట్లు డాక్టర్ గోపాల్, డాక్టర్ మనోజ్‌లాల్ పలుమార్లు ఉన్నతాధికారులకు, స్థానిక ఎమ్మెల్యేలకు, కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేశారు. అప్‌గ్రేడ్ చేస్తామన్నారే తప్పా..ఇంతవరకు ఆ దిశగా కృషి చేయలేకపోయారు. ఇప్పటికైనా ఎమ్మెల్యేతో పాటు ఉన్నతాధికారులు దృష్టి సారించి దుగ్గొండి, నెక్కొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కమ్యూనిటీ హెల్త్ సెంటర్లుగా మారిస్తే మండలాల స్థాయిలో ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.


వర్ధన్నపేట ప్రభుత్వాస్పత్రి

అప్‌గ్రేడ్‌తో వైద్య సేవలు అందుబాటులోకి..

జిల్లా వ్యాప్తంగా మొత్తం 13 మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల్లో 14 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 7 బస్తీ దవాఖానాలు మొత్తం కలిపి 21 ఉన్నాయి. నర్సంపేట డివిజన్‌లోని ఆరు మండలాల్లో 9 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలో రెండు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు వర్ధన్నపేట, (నర్సంపేట గతంలో..) ఉన్నాయి. నర్సంపేట ఆస్పత్రికి మెడికల్ కళాశాల మంజూరు కాగానే డీఎంఈ ఆధ్వర్యంలోకి వెళ్లింది. టీవీవీపీలో పనిచేస్తున్న రెగ్యులర్ వైద్యులను, నర్సులను వర్ధన్నపేట, పరకాల సీహెచ్‌సీల్లో సర్దుబాటు చేశారు. దీంతో వైద్యులు పూర్తిగా వెళ్లిపోయారు. డీఎంఈ పరిధిలో నర్సులు ఎవరు రాకపోవడంతో డిప్యూటేషన్‌పై నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రిలోనే పనిచేస్తున్నారు. డీఎంఈ ఆధ్వర్యంలో నర్సులు రాగానే డిప్యూటేషన్‌లో ఉన్న వారిని రెగ్యులర్ స్థానాలకు పంపించడం జరుగుతుంది. అదేవిధంగా 15 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బందిని సైతం కాంట్రాక్టర్ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలోనే పనిచేస్తున్నారు. వీరిని సర్దుబాటు చేయడానికి అవకాశం లేకపోవడంతో మళ్లీ డీఎంఈలో తాత్కాలికంగా పనిచేసేందుకు ఉన్నతాధికారులు ఒప్పుకోవడంతో విధుల్లోకి తీసుకున్నారు. నర్సంపేట ఆస్పత్రిని డీఎంఈగా అప్‌గ్రేడ్ చేసే సందర్భంగా నర్సంపేట నియోజకవర్గంలోని నెక్కొండ, దుగ్గొండి మండలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)గా మార్చాలని కోరుతూ అప్పట్లో వినతులను సైతం అందించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి రెఫర్ చేస్తే కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వస్తారని, అక్కడ నుంచి రెఫర్ చేస్తే నర్సంపేట జనరల్ ఆస్పత్రికి వచ్చి వైద్యపరీక్షలు చేయించుకుంటారు. ఈ వ్యవస్థ ద్వారా గ్రామం నుంచి జిల్లాస్థాయి ఆస్పత్రి వరకు పేదలకు మరిన్ని వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులకు విన్నవించాం..



నర్సంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను జనరల్ ఆస్పత్రిగా, మెడికల్ కళాశాల మంజూరు చేశారు. దీంతో అప్పుడు ఉన్న నర్సంపేట టీవీవీపీ సూపరింటెండెంట్లు డాక్టర్ గోపాల్, మనోజ్‌లాల్‌ల ఆధ్వర్యంలో గతంలోనే స్థానిక ఎమ్మెల్యే, ఉన్నతాధికారులకు నెక్కొండ, దుగ్గొండి మండలాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అప్‌గ్రేడ్ చేయాలని విన్నవించాం. జిల్లావ్యాప్తంగా వర్ధన్నపేట ఒకటే కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఉంది. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నడుచుకుంటాం.

– డాక్టర్ రామ్మూర్తి, డీసీహెచ్ఎస్, వర్ధన్నపేట

'మత్స్యకార' సభ్యత్వాలు పూర్తిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్

నర్సంపేట రూరల్ : రాజపల్లె గ్రామ మత్స్యకార సొసైటీ సభ్యత్వాలు త్వరగా పూర్తి చేయాలని మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లోని పలు గ్రామాల్లో మత్స్యకార సొసైటీ సభ్యత్వాలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. జిల్లా అధికారులు వాటిని త్వరగా పరిష్కరించి ముదిరాజ్‌లకు న్యాయం చేయాలన్నారు. సభ్యత్వాల్లో సమస్యల ఉంటే వాటిని నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. రాజపల్లె గ్రామ ముదిరాజ్‌ల సమస్యను అధికారులతో మాట్లాడి పరిష్కరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల యాదగిరి, గౌరవ అధ్యక్షుడు పిట్టల కుమారస్వామి, డివిజన్ నాయకులు కొప్పు అశోక్, కొక్కు నర్సింహాస్వామి, పొన్నం రాజు, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు విడుదల చేయండి


దుగ్గొండి: ఎంపీడీఓ అరుంధతికి వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

దుగ్గొండి : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా విధులు నిర్వర్తిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని ఎంపీడీఓ అరుంధతికి బుధవారం వినతిపత్రం అందించారు. నాలుగు నెలలుగా వేతనాలు అందకపోవడం వల్ల కుటుంబ జీవనం కష్టంగా మారిందని, తమకు ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి ఆదుకోవాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు బాలు నాయక్, సుమలత, రాణి, జయ, స్వర్ణ, రమేశ్, కవిత, ప్రశాంత్, రవి, ఐలయ్య, శారదతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు వినతి


సంగెం: వినతిపత్రం అందజేస్తున్న ఎఫ్ఏలు

సంగెం : పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ బుధవారం ఎంపీడీఓ రవీందర్‌ను కోరారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ..2006 నుంచి ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్నామని వివరించారు. తమకు ఈ వేతనం తప్ప మరో ఆధారం లేదని, వేతనాలు రాక కుటుంబాలు పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు రవి, అశోక్, రాజు, రాజేందర్, దేవసింగ్, సూరయ్య, నాగయ్య, ఉపేందర్,సమ్మయ్య, హరినాథ్, లింగమూర్తి, సమ్మయ్య, సంపత్, శ్రీదేవి, సాంబరాజు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


మక్కలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

నర్సంపేట : అకాల వర్షానికి నష్టపోయిన వరి, మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు (సీపీఎం) జిల్లా కమిటీ సభ్యుడు పరికి మధుకర్ డిమాండ్ చేశారు. చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లిలో అకాల వర్షానికి నేలమట్టమైన వరి, తడిసిన మొక్కజొన్నలను బుధవారం వారు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి పంటలు చేతికొచ్చే సమయంలో అకాల వర్షంతో రైతులకు కన్నీరే మిగులుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కష్టాలు, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే వ్యవసాయ అధికారులు కుర్చీలకే పరిమితమై చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. నిర్లక్ష్యంగా ఉన్న అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని ఆయన కోరారు. మొక్కజొన్నలకు రూ.3వేల గిట్టుబాటు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అన్నారు. పంట నష్టాన్ని తక్షణమే అంచనావేసి రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పెరుమాండ్ల అమరేందర్‌రెడ్డి, రైతులు మహ్మద్ బాషమీయ, లంకలపల్లి రాజాలు, రాములు, దొనకొండ భూపాల్‌రెడ్డి, పప్పు శ్రీపాల్, కుక్కల రాజు, అందే వీరేశం,మోర శంకర్, గుల్లపల్లి బాబు, కట్టయ్య పాల్గొన్నారు.

ఒత్తిడికి గురికావొద్దు


సురేశ్‌ను సన్మానిస్తున్న సుబ్బారావు

నర్సంపేట : విద్యార్థులకు చదువుతో పాటు మానసిక దృఢత్వం, శాస్త్ర పరిజ్ఞానం కలిగి ఉండాలని ప్రముఖ ఇంటర్నేషనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ గిరిగాని సురేశ్ పేర్కొన్నారు. నర్సంపేట పట్టణంలోని గీతాంజలి గ్రూఫ్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో బుధవారం పర్సనల్ డెవలప్‌మెంట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి గురి కావొద్దని, మానసికంగా కృంగిపోకుండా వాటిని అధిగమిస్తూ ఉత్సాహంగా విజయ తీరాలను చేరుకోవాలని తెలిపారు. అనంతరం సురేశ్‌ను పాఠశాల చైర్మన్ వేములపల్లి సుబ్బారావు అభినందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాధవశంకర్, డాక్టర్ జయుడు, డైరెక్టర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలి


నినాదాలు చేస్తున్న రాజేశ్ తదితరులు

వర్ధన్నపేట : స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించడంతో పాటు అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణ కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు మహ్మద్ షరీఫ్ అధ్యక్షతన సంఘం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాజేష్ హాజరై, మాట్లాడుతూ.. దివ్యాంగులకు రూ.6వేల పెన్షన్, ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి దివ్యాంగుల శాఖను వేరు చేయడంతో పాటు స్థానిక సంస్థ ఎన్నికల్లో రిజర్వేషన్ తదితర హామీలను సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చారని గుర్తుచేశారు. గద్దెనెక్కిన తర్వాత దివ్యాంగులను చిన్నచూపు చూడటం శోచనీయం అన్నారు. కాంగ్రెస్ నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి మోసపూరిత పాలనను నిరసిస్తూ ఆయన స్వగ్రామం కొండారెడ్డిపల్లి నుంచి సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ వరకు వందలాది మంది దివ్యాంగులతో త్వరలోనే పాదయాత్ర చేస్తామని స్పష్టం చేశారు. అక్రమ అరెస్టులతో నిర్బంధించాలని ప్రయత్నిస్తే కాంగ్రెస్ పార్టీ తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లూరు ఈదయ్య బాబు, జిల్లా నాయకులు గుంటి శివకుమార్, అరూరి బాబు, చిన్న వెంకన్న, పెద్ద వెంకన్న, జక్కుల నరసమ్మ, గోగుల కలమ్మ, బీరెల్లి కలమ్మ, శ్రీరాములు లింగయ్య, మద్దెల గోపయ్య, శ్రీరాముల నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వడ్డీలేని రుణాలతో ఆర్థిక భరోసా


పాలాభిషేకం చేస్తున్న హరిబాబు, మహిళలు

ఖానాపురం : వడ్డీలేని రుణాలతో ప్రభుత్వం మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో బుధవారం మండల సమాఖ్య ఆధ్వర్యంలో వడ్డీలేని రుణాలు అందజేస్తున్నందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మండల సమాఖ్యకు బస్సు కొనుగోలు చేసుకోవడానికి రూ.30 లక్షలను మంజూరు చేయడం సంతోషకరమని వివరించారు. ప్రభుత్వ సహకారంతో మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చూసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల జగన్‌మోహన్‌రెడ్డి, ఏపీఎం కందిక సుధాకర్, మండల సమాఖ్య బాధ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాలు


బోనాలతో వెళ్తున్న మహిళలు, ప్రజలు

పర్వతగిరి : మండల కేంద్రంలో కంఠమహేశ్వరస్వామికి గౌడ కులస్తులు బుధవారం రాత్రి బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు బోనాలతో ఆలయం వద్దకు వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం ప్రతినిధులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు తరలిరావాలి


నర్సంపేట: రజతోత్సవ సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


ఖానాపురం: విరాళం అందజేస్తున్న పూలునాయక్

నర్సంపేట : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27వ తేదీన జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు లక్షలాది కార్యకర్తలు తరలి రావాలని బీఆర్ఎస్ జిల్లా నాయకులు నల్ల మనోహర్‌రెడ్డి, మునిగాల వెంకట్‌రెడ్డి, డాక్టర్ లెక్కల విద్యాసాగర్ రెడ్డి కోరారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్ అధ్యక్షతన పట్టణంలో బుధవారం రజతోత్సవ సభ వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అందించిన సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామ రక్ష అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం కోసం ఇచ్చిన హామీలను అమలు చేయలేక మోసం చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, పట్టణ కార్యదర్శి వేనుముద్దల శ్రీధర్‌రెడ్డి, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు రాయిడి దుష్యంత్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, మహిళా విభాగం అధ్యక్షురాలు వాసం కరుణ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'హామీల అమలులో కాంగ్రెస్ విఫలం'

ఖానాపురం : హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రజతోత్సవ సన్నాహక సమావేశం నిర్వహించి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. మాజీ ఎంపీటీసీ బోడ పూలు నాయక్ సభ నిర్వహణకు రూ.2వేల విరాళాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ మోసాలను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో నాయకులు ప్రకాశ్‌రావు, వెంకటనర్సయ్య, వేజెళ్ల కిషన్‌రావు, అశోక్, వల్లెపు శ్రీనివాస్, రాజు, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం


వర్ధన్నపేట: ధాన్యం కాంటా వేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు తదితరులు


పర్వతగిరి: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

వర్ధన్నపేట : రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం కల్పిస్తోందని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పేర్కొన్నారు. బుధవారం వర్ధన్నపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు దళారులకు ధాన్యం విక్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. రైతు పండించిన చివరి ధాన్యపు గింజ వరకు కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేయిస్తామని, అయితే రైతులు ఎలాంటి తాలు, తేమ లేకుండా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకురావాలని సూచించారు. రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాజేష్ ఖన్నా, మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

పర్వతగిరి : ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని ఎంపీడీఓ శంకర్ నాయక్ సూచించారు. మండలంలోని మాల్యా తండా, కల్లెడ, రావూరు, అన్నారం గ్రామాల్లో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను శంకర్‌నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు మద్దతు ధర కల్పించేలా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందన్నారు. సన్నరకం ధాన్యానికి రూ.2,320, బోనస్ రూ.500కలిపి ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ధాన్యంలో తాలు లేకుండా, 17శాతం తేమ ఉండేలా రైతులు ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకు రావాలని సూచించారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు, రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ డీపీఎం భవాని, ఎంపీఓ పాక శ్రీనివాస్, ఏపీఎం కృష్ణమూర్తి, వివిధ గ్రామ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, సీసీలు కాంతయ్య, రమాదేవి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌కూలర్ బహూకరణ


కూలర్‌ను ప్రారంభిస్తున్న రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట : నర్సంపేట ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు తాగునీరు అందించేందుకు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తన తల్లి గోగుల జయశ్రీ జ్ఞాపకార్థం వాటర్ కూలర్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా నూతన వాటర్ కూలర్‌ను కుటుంబ సభ్యులు, ఆర్టీసీ డీఎం ప్రసూనలక్ష్మితో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు, తదితరులు పాల్గొన్నారు.